క్లుప్తంగా

అవుకు రిజర్వాయర్ చేరిన జీఎన్ఎస్ఎస్ నీరు



యాగంటిపల్లె వద్ద జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం

బనగానపల్లె : గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేసిన నీరు గురువారం బనగానపల్లె సమీపంలోని యాగంటిపల్లె మీదుగా అవుకు రిజర్వాయర్‌కు చేరింది. ఈ కాల్వ ద్వారా సుమారు 10వేల క్యూసెక్కుల నీటిని సంబంధిత అధికారులు విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకున్న తర్వాత ఈ నీటిని వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోటకు విడుదల చేస్తారు.అక్కడి నుంచి మైలవరం మీదుగా ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అభినందనీయం



మోటార్‌ను అందజేస్తున్న జ్ఞాన నిధి సేవా సంస్థ సభ్యులు

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అభినందనీయమని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. గురువారం డ్రైవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి మోటార్‌ను జ్ఞాన నిధి సేవా సంస్థ సభ్యులు విరాళమిచ్చారు. కార్యక్రమంలో జ్ఞాన నిధి సభ్యులు ఆనంద్, తిమ్మయ్య, హెచ్ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు పుల్లయ్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సంతాపం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన జామియా మసీద్ మౌజన్ ఇదాయత్ అలీ (85) మృతిచెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మాజీ ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాకీరు హుస్సేన్, ఉపాధ్యక్షులు తిరుమలేష్, నాయకులు అల్తాఫ్, ఎద్దులన్న, ఖాజా తదితరులు ఇదాయత్‌అలీ మృతదేహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి కేజీబీవీ విద్యార్థిని



దివ్యాంజలి

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థిని దివ్యాంజలి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబీదా బేగం గురువారం తెలిపారు. తమ కళాశాలలో పదవ తరగతిలో 568 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ నూజివీడుకు ఎంపికై ందన్నారు. విద్యార్థినికి ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ అబీదాబేగం అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని వ్యాపారులు, హోటళ్ల యాజమానులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలు, కూరగాయాల అంగళ్లలో తనిఖీ చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషేధించాని, నిబంధనలు అతిక్రమించే వారికి జరిమానా తప్పదని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్యాపిలి: మండల విద్యాధికారి–1గా కె.మహేశ్వర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణయ్య కొలిమిగుండ్లకు బదలీ కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం మహేశ్వర్ రెడ్డిని నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంఈఓకు యూటీఎఫ్, ఎస్టీయూ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు.

వ్యక్తిపై దాడి

కోవెలకుంట్ల: స్థానిక సంతమార్కెట్ సమీపంలో ఓ వ్యక్తిపై గురువారం కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఇంటి పోరు విషయంలో రెండు కుటుంబాలు ఘర్షణకు దిగగా రఘురామిరెడ్డి అనే వ్యక్తిపై రామిరెడ్డితోపాటు కుటుంబ సభ్యులు దాడి చేయడంతో గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తొలి అడుగు కాదు..ఇదే చివరి అడుగు

- బాబు అంటేనే మోసం
- కూటమి పాలనలో అన్నీ అక్రమ కేసులే
- పోలీసులకే రక్షణలేదు..ప్రజలనే ఏం కాపాడుతారు?
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజం
- అల్వకొండలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ'



ప్రజలకు బాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన జనం

సంజామల: రాష్ట్రానికి ఏదో మంచి చేశామని కూటమి నాయకులు సుపరిపాలన.. తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నారని, వారికి తొలి అడుగు కాదని..ఇదే చివరి అడుగని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని అల్వకొండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకులు అందనం బాబు, నాగ ప్రసాద్ రెడ్డి, మూసాని వెంకటేశ్వర్ రెడ్డితో కలసి గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లడుతూ..ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన చంద్రబాబు ఏడాది పూర్తయినా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సంక్షేమం అందరికీ సాధ్యం కాదని, అది కేవలం వైఎస్ కుటుంబానికే సాధ్యమన్నారు.

రైతు సంక్షేమం గాలికి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకానికి పెద్ద పీటవేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం విస్మరించిందని మండిపడ్డారు. నాడు జగనన్న ఏటా రైతులకు రూ.13,500 రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం చేస్తే.. నేడు ఆ పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరుమార్చి చేతులు దులుపుకున్నారన్నారు. పథకం అమలు గురించి ప్రశ్నిస్తే.. అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండటంతో అన్నదాతల చేతిలో చిల్లిగవ్వ లేక అందినకాడల్లా అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రైతులకు విత్తనాలు, యూరియా సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నారని చెప్పారు. మిర్చి,పొగాకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను అప్పులపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామంలో టీడీపీ నాయకుల అరాచకాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో అరాచకాలు పెరిగాయని కాటసాని అన్నారు. గ్రామంలో బెల్ట్‌షాప్‌లో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు.అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పొలాలకు రస్తాలు లేకుండా చేసి అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు అందనం బాబుపై మూడు అక్రమ కేసులు పెట్టి సబ్‌జైలుకు పంపారన్నారు. అక్రమ కేసులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నాయకులు పోచా వెంకటరామిరెడ్డి, రెడ్డిపల్లె నరసింహారెడ్డి, గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, మూసాని వెంకటకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి,శివరామిరెడ్డి,రామసుబ్బరెడ్డి.పగడాల ప్రసాద్,మద్దిలేటి,యువరాజు,ఉయ్యాలవాడ కాశిం బాషా,రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో పోలీసులకు రక్షణ లేదు..

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సొంత నియోజకవర్గంలో పోలీసులకే రక్షణ లేదని, ఇక సామాన్యులను ఏం కాపాడుతారన్నారు. బుధవారం మంత్రి కొలిమిగుండ్ల పర్యటలో మంత్రికి రక్షణ కల్పించే రక్షణభటునిపై మంత్రి బంధువు దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మీద పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తుంటే పోలీసులపై టీడీపీ నాయకులు,కార్యకర్తలు దాడి చేస్తున్నారన్నారు.

తిరుపతి రైలు స్టాపింగ్‌పై హర్షం



స్టేషన్‌మాస్టర్‌ను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: నంద్యాల– యర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రతి రోజు నడుస్తున్న గుంటూరు– తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు స్టేషన్లలో స్టాపింగ్‌కు దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ చేరుకుని స్టేషన్ మాస్టర్ గురుచరణ్‌ను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు కరీంబాషా, సుధాకర్ మాట్లాడుతూ ఈ మార్గంలో రోజూ గుంటూరు నుంచి కోవెలకుంట్ల మీదుగా తిరుపతికి ఒక రైలు, తిరుపతి నుంచి గుంటూరుకు మరో రైలు నడుస్తోందన్నారు. నెల నుంచి స్టాపింగ్ లేకపోవడంతో కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ప్రజలు తిరుపతి, గుంటూరు, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిచేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. రైల్వే శాఖ శనివారం నుంచి ఆరు నెలల పాటు కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు స్టేషన్లలో స్టాపింగ్‌కు అనుమతి ఇవ్వడం శుభపరిణామమన్నారు. నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, వడ్డే సుబ్బరాయుడు, లింగన్న, షమీన్, రామచంద్రరాజు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న స్థానిక సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి నిరుద్యోగ యువతకు సూచించారు. జాబ్ మేళా వాల్ పోస్టర్లను గురువారం ఆయన నివాసంలో విడుదల చేశారు. పది జాతీయ కంపెనీల ప్రజాప్రతినిధులు హాజరై యువతను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది విఘ్నేష్, పుల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మహేంద్రగౌడ్ ఉన్నారు.

అఖిల భారత వర్కింగ్ కమిటీలో బేతంచెర్ల వాసికి చోటు



వై.ఎల్లయ్య

డోన్ టౌన్: ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ అఖిల భారత వర్కింగ్ కమిటీ సభ్యుడిగా బేతంచెర్లకు చెందిన వై.ఎల్లయ్య ఎన్నికయ్యారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో నాలుగు రోజుల పాటు జరిగిన 12వ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహా సభల్లో నంద్యాల జిల్లా నుంచి తనను ఎన్నుకున్నట్లు ఎల్లయ్య తెలిపారు. ఎల్లయ్య ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గండికోటకు నీరు విడుదల



చెర్లోపల్లె హెడ్‌రెగ్యులేటర్ నుంచి గండికోటకు నీటిని విడుదల చేసిన దృశ్యం

అవుకు: పట్టణ శివారులోని రిజర్వాయర్ నుంచి గండికోట రిజర్వాయర్‌కు గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. జమ్ములమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎస్.ఈ రవికిరణ్ అవుకు సమీపంలోని చెర్లోపల్లె హెడ్‌రెగ్యులేటర్‌కు చెందిన నాలుగు గేట్లను ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్‌కు జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 13,500 క్యూసెక్కుల వరద నీరు, ఎస్సార్బీసీ కాలువ ద్వారా 545 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని, ఇందులో పంటల సాగుకు ఎస్సార్బీసీ కాలువకు 300 క్యూసెక్కులు, గండికోటకు 3వేల క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.92 టీఎంసీ నీటి నిల్వ ఉందని చెప్పారు. కార్యక్రమంలో అవుకు, జమ్ములమడుగు ఈఈ లు సుభకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



రాజయ్య దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని డోన్, నంద్యాల డిప్యూటీ ఈఓలు వెంకట్రామిరెడ్డి, శంకర్‌ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా, కొలిమిగుండ్ల, సంజామల ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేస్తున్న రాజయ్య గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజయ్య దంపతులకు పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ, పదవీ విరమణ సర్వసాధారణమన్నారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా దాదాపు 15 సంవత్సరాలుపాటు రాజయ్య విశిష్ట సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో నంద్యాల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల ఎంఈఓలు బ్రహ్మంనాయక్, రఘురామిరెడ్డి, రామకృష్ణ, వెంకటసుబ్బయ్య, నంద్యాల జిల్లా విద్యాశాఖ ఏడీ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, షరీఫ్, వసుంధర, నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

బేతంచెర్ల: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంలో దివ్యాంగులకు కూడా ప్రాధాన్యతనివ్వాలని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, రాముడు కోరారు. గురువారం వారు మా ట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఆందోళనలు చేపడతామన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల: రోడ్డుప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బైనపల్లెకు చెందిన మణివర్ధన్ (23) కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. సాలమ్మ కుమారుడు మణివర్ధన్ చౌడేశ్వరి అమ్మవారి సేవకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా పట్టణ సమీపంలో ఆటోఢీ కొంది. ప్రమాదంలో మణివర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి ఫలితం లేకపోయింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

ప్యాపిలి: నల్లమేకలపల్లి గ్రామం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేని ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జలదుర్గం ఎస్ఐ నాగార్జున తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యా ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: పట్టణానికి చెందిన మిరపకాయల వినయ్ కుమార్‌కు ఇంజనీరింగ్ విద్యా ఖర్చులకు 1990–91 బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం గురువారం ఆర్థికసాయం అందజేశారు. వినయ్‌కుమార్ తల్లిదండ్రులు ఇద్దరూ చని పోవడంతో అనాథగా మిగిలాడు. పదో తరగతి, ఇంటర్ మీడియట్ ప్యాపిలిలో చదివిన వినయ్ కుమార్‌కు ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో బీటెక్‌లో సీటు వచ్చింది. విషయం తెలుసుకున్న తండ్రి రంగనాథ్ పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం విద్యాఖర్చులకు రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. అవసరమైతే భవిష్యత్తులో కూడా వినయ్‌కుమార్‌కు ఆర్థికసాయం అందజేసి అతని అభివృద్ధికి తమ వంతు అండగా నిలుస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో గరికపాటి మధు, వెంకటసత్యనారాయణ, దేవేంద్ర, గడ్డం భువనేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ రాజు, గండికోట రామాజంనేయులు, వకందారి శ్రీధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

బేతంచెర్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు అన్నారు. గురువారం ఆర్టీసీ బస్టాండు పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు బాధ్యతగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెత్త కుండీలను అందజేశారు. మన ఊరు–మన బస్టాండును పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త కుండీలలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పంచాయతీ కార్యాలయం



పంచాయతీ కార్యాలయం ఆవరణలో పడి ఉన్న మద్యం సీసాలు

ప్యాపిలి: ఏనుగుమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయం మందు బాబులకు అడ్డాగా మారింది. పంచాయతీ కార్యాలయం సమీపంలోనే అధికార పార్టీ నాయకులు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం కాగానే మందుబాబులు బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సిట్టింగ్ వేస్తున్నారు. రాత్రంతా అక్కడే పూటుగా మద్యం సేవించి మందు బాటిల్లు, ఇతర సామాగ్రి అక్కడే వదిలేసి వెల్తున్నారు. దీంతో ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి మందుబాబులు పంచాయతీ ఆవరణలో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముందుకు కదలని మురుగు



కల్వర్టు వద్ద నిలిచిన మురుగునీరు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారి పక్కనున్న కల్వర్టు వద్ద మురుగునీరు కొద్ది రోజులుగా ముందుకెళ్లకపోవడంతో నిలిచిపోయింది. గ్రామంలోని రెండు వైపులా ఉన్న కాల్వల నుంచి వచ్చే మురుగునీరు అంతా ప్రధాన రహదారి వద్దనున్న కల్వర్టులో చేరి బయటకు వెళ్లిపోతుండేవి. కల్వర్టు లోపలి భాగంలో చెత్త అడ్డుపడటంతో మురుగు ముందుకు కదలడం లేదు. ఇప్పటికే రెండు కాల్వలు నిండుగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచిన సచివాలయ నిర్మాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో గ్రామ సచివాలయం, బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణ పనులు నిలిచిపోయి సుమారు ఏడాదికిపైగా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు కాకపోవడమో, మరే కారణం చేతనో కానీ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్త గ్రూపు తెలుసుకొని ఉండాలి



విద్యార్థుల రక్త నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

ప్యాపిలి: అత్యవసర సమయంలో రక్త మార్పిడికి సమయం వృథా కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వారి రక్తం గ్రూపు వివరాలు తెలుసుకుని ఉండాలని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ వేంకటేశ్వర ల్యాబ్ సిబ్బంది 122 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తం గ్రూపు తెలుసుకోవడంతో పాటు విద్యార్థులు రక్తదానం ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి పాల్గొన్నారు.

నేత్రదానం

బేతంచెర్ల: గుండెపోటుతో మరణించిన పట్టణానికి చెందిన మారం వెంకటేశ్వర్లు (65), కొత్త బస్టాండుకు చెందిన ఎద్దుల స్వామిదేవి (55) నేత్రాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యుల సహకారంతో కర్నూలు గవర్నమెంట్ ఆస్పత్రి సిబ్బంది మృతుల నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా దానం చేశారు. కార్యక్రమంలో లైఫ్ యువనేత్ర సభ్యులు శ్రీనివాసులు, రామకృష్ణ, చందు, రంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: 11 కేవీ కొత్త ఫీడర్ ఏర్పాటు పనులు జరుగుతున్న కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంగళాంపల్లి, వెంకటాపురం, ఎస్ రంగాపురం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

డోన్ టౌన్: డోన్ సమీపంలోని ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్ పరిధిలో బేతంచెర్ల–డోన్ జాతీయ రహదారి పనులు జరుగుతున్నందున, 11 కెవి లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా కోట్లవారిపల్లె నుంచి కరిటికొండ సుంకులమ్మ వరకు శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ నాగేంద్ర, జేఈఈ ఖుషిధర్ తెలిపారు.

పంటను కాపాడుకునేందుకు..



సాధుకొట్టం వద్ద మొక్కజొన్న పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన చీరలు

బనగానపల్లె : పంటలను కాపాడుకునేందుకు రైతులు విభిన్న మార్గాలను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా పంట చేతికొచ్చే దశలో జంతువులు, పక్షులు ఆశిస్తాయి. వాటి నుంచి రక్షించుకునేందుకు నూతన, తక్కువ ఖర్చుతో రక్షణ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో మొక్కజొన్న పంట కంకి దశలో ఉంది. దీంతో పంటను అడవి పందులు, కోతులు, పక్షులు ఆశించి నష్టపరుస్తాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు చీరలను రక్షణ గోడగా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో బనగానపల్లె మండలంలో ఎక్కువ విస్తీర్ణం..సుమారు 4వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. గతేడాది నుంచి ఇతర పంటల కన్నా మొక్కజొన్న పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటం, గిట్టుబాటుగా లభిస్తున్నందున ఈ ఏడాది కూడా ఈ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. మండలంలోని పసుపల తండా, చెర్లోకొత్తూరు, మీరాపురం మాదసుపల్లి ప్రాంతాల్లో మొక్కజొన్న పంటను అడవి పందులు ఎక్కువగా ఆశిస్తుండగా.. ఇతర ప్రాంతాల్లో కోతులు, పక్షుల బెడద ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. గాలికి చీరల నుంచి వచ్చే శబ్ధంతో పంట సమీపానికి జంతువులు, పక్షులు రావడానికి జంకుతాయని అన్నదాతలు పేర్కొంటున్నారు. అలాగే.. పలువురు రీచార్జబుల్, మైక్‌ల ద్వారా వివిధ రకాల శబ్ధాలు వచ్చేలా సౌండ్ ఏర్పాటు చేస్తున్నారు.

ఏఈ లేక.. నిధులు మంజూరు కాక!

- అభివృద్ధికి నోచుకోని చెరువులు
- గతేడాది ఆగస్టు నుంచి మైనర్ ఇరిగేషన్‌లో ఏఈ సీటు ఖాళీ



బనగానపల్లెలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

బనగానపల్లె : బనగానపల్లె, అవుకు మండలాలకు చెందిన బనగానపల్లె సెక్షన్ మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో 8 నెలలుగా రెగ్యులర్ ఏఈ లేనందున చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో చెరువులు.. ఆయకట్టు రైతులు, ప్రజలకు ఉపయోపగపడటం లేదు. చాలా వరకు నిరుపయోగంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఏఈని గతేడాది ఆగస్టులో శిరివెళ్ల సెక్షన్‌కు బదిలీ చేయగా, కోవెలకుంట్ల మైనర్ ఇరిగేషన్ కార్యాలయానికి చెందిన ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కోవెలకుంట్ల సెక్షన్ పరిధిలో కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల మండలాలలు ఉన్నందున ఈ అధికారికి బనగానపల్లె సెక్షన్ పరిధిలోని బనగానపల్లె, అవుకు మండలాల్లోని చెరువులు, కుంటల పర్యవేక్షణ బాధ్యతను నిర్వహించలేకపోతున్నారు. ప్రధానంగా బనగానపల్లె మండలంలోని 1,513 ఎకరాల ఆయకట్టు కలిగిన మీడియం ఇరిగేషన్ దద్దణాల ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను వర్షా కాలంలో నిర్వహించాల్సి ఉంది. బనగానపల్లె సెక్షన్ పరిధిలోని చెరువులు, కుంటలు అధిక శాతం చాలా కాలంగా అక్రమణలకు గురవుతున్నందున అవి ఉనికిని కోల్పోతున్నాయి. దీంతో వీటిని కాపాడాల్సిన బాధ్యత ఏఈపై ఉంటుంది. రెగ్యులర్ ఏఈ లేనందున పర్యవేక్షణ పర్యవేక్షణ కొరవడిందని ఇక్కడి రైతుల, ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు బనగానపల్లె మైనర్ ఇరిగేషన్ కార్యాలయానికి రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరుతున్నారు.

PUBLIC NOTICE

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన శ్రీమతి యర్రంరెడ్డి హైమావతి W/o యర్రంరెడ్డి వెంకట నారాయణ రెడ్డి, R/o H.No: 2/350/8, బేతంచెర్ల గ్రామము మరియు మండలం, నంద్యాల జిల్లా అను వారు దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి చెందిన లింక్ దస్తావేజు నెం. 1037/2009 SRO బేతంచెర్లను ఇదివరలో కర్నూలు నుండి బేతంచెర్లకు బస్సులో ప్రయాణిస్తుండగా పోగొట్టుకొని యున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల దిగువ తెలిపిన అడ్రస్సులో గాని నా క్లయింటు అడ్రస్సులో గాని ఏడు (7) దినములలోగా తెలియపర్చగలరు.

షెడ్యూలు: కర్నూలు జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, బేతంచెర్ల సబ్‌డివి చెందిన ప్రస్తుతం నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం, బేతంచెర్ల గ్రామ పొలంలోని సర్వే నెం. 210 పైకి వేయబడిన ప్లాట్లపైకి ప్లాటు నెం. 23 యొక్క విస్తీర్ణం 330.66 చ.గల స్థలములో నిర్మించిన ఇంటి యొక్క డోరు నెం. 2-350/8 సదరు ఇంటి యొక్క కట్టిన విస్తీర్ణం 560 చ.అ. సదరు ఇంటి యొక్క పూర్తి విస్తీర్ణం 330.66 చ.గ.లు ఇందుకు చెక్కుబంది వివరం: తూర్పు: ప్లాటు నెం. 22, పడమర: వంక ఉత్తరం: ప్లాటు నెం. 14, దక్షిణం: 30 అడుగుల వెడల్పు గల రోడ్డు.

G.S.Vijaya Bhaskar Reddy, B.A.,B.L., Advocate
Address : H.No.87-1077, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool.
Cell: 9347928866, 9985474567

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కర్నూలు
దివాళా అర్జీ నెం. 40/2025
షేక్ సుబాన్ .. అర్జీదారు/పిటిషనర్
-Vs-
కొలిమి ఖాజ మరియు 6 మంది ..ప్రతివాదులు

జనరల్ నోటీసు

నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం పరిసర ప్రాంత ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై కేసులో అర్జీదారుడైన షేక్ సుబాన్ తండ్రి షేక్ షిలార్ సాహెబ్, ఇంటి నెం. 46-495, బుధవారపేట, కర్నూలు టౌన్ అను వ్యక్తి తనను దివాళా దారుగా తీర్మానం చేయమని కోరుతూ పై న్యాయస్థానంలో దివాలా అర్జీ దాఖలు చేశారు. ఇందుపైన ఎవరికైన ను ఎటువంటి ఆక్షేపణలు ఉన్న తేది 12-09-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని ఎడల పరోక్షముగా విచారించి తీర్మాణం చేయబడును.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు

PERFECT LAW ASSOCIATES
బంగి సుధీర్, కల్లె మద్దేసు,
న్యాయవాదులు, కర్నూలు.
సెల్: 90147 20141, 90141 14204